ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



త్వరలో
మూడో అతిపెద్ద
ఆర్థిక వ్యవస్థగా
## భారత్
ప్రధాని మోదీ

2లో..

సంపుటి: 2 | సంచిక: 111 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 31 జులై 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

# వయనాడ్ విలయం

## 123 మంది మృతి

600 మంది కార్మికులు గల్లంతు
కొండచరియలు, వరదలు చేసిన విధ్వంసం
కంటతడి పెట్టిస్తున్న విషాద దృశ్యాలు
ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ ఒళ్లు గగుర్పొడిచే రెస్క్యూ ఆపరేషన్
చలియార్ నదిలో తేలియాడిన మృతదేహాలు
బురదలో కొట్టుకుపోయిన ఇళ్లు, దుకాణాలు
శిథిలాల కింద చిక్కుకుని బాధితుల ఆర్తనాదాలు





వయనాడ్, జులై 30 (ప్రభాత ఉదయం): కేరళలోని వయనాడ్ జిల్లాలో ప్రకృతి ప్రకోపంతో బీభత్సం సృష్టించింది. భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడి మొత్తం 123 మంది మృతి చెందారు. శిథిలాల కింద చాలా మంది ఉంటారన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మరో పక్క ఎన్నో ఇళ్లు నేలమట్టమయ్యాయి. వయనాడ్ జిల్లాలోని మెప్పాడి, ముండక్కై, చురల్‌మల ప్రాంతాల్లో ఈ విషాదం చోటుచేసుకుంది. అనేక వాహనాలు కొట్టుకుపోయాయి. చురల్‌మలలో కొంత భాగం తుడిచి పెట్టుకుపోయింది. ఇప్పటికీ అనేక మంది శిథిలాల కింద చిక్కుకుని సాయం కోసం ఆర్తనాదాలు చేస్తున్నారు. వీరిని కాపాడేందుకు ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. మరో పక్క ఎడతెరిపి లేని వర్షాలతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. తొలుత అర్ధరాత్రి ముండక్కై ప్రాంతంలో కొండచరియలు విరిగిపడ్డాయి. సహాయ బృందాలు చేరుకొని బాధితులను సమీపంలోని చురల్‌మల స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరానికి తరలించాయి. ఈ క్రమంలో తెల్లవారుజామున దీనికి సమీపంలో మరోసారి కొండచరియలు పడ్డాయి. దీంతో శిబిరం సహా చుట్టుపక్కల ఇళ్లు, దుకాణాలు బురదలో కొట్టుకుపోయాయి. సహాయక బృందాలు గాలింపు చేపడుతున్నాయి. డ్రోన్లు, జాగిలాలతో అన్వేషణ సాగిస్తున్నాయి. స్థానికుల కథనం ప్రకారం ఈ ప్రాంతంలోని

..మిగతా 2లో



# రైతులకు తీపి కబురు

## రెండో విడత రుణమాఫీ ప్రారంభం

లాంఛనంగా ప్రారంభించిన సీఎం రేవంత్
అర్హులకు లక్షన్నర రుణమాఫీ కింద నిధులు విడుదల
6,40,223 మందికి రూ.6190.01 కోట్లు నిధులు విడుదల
రైతుల ప్రయోజనమే మా ప్రాధాన్యం అన్న సీఎం రేవంత్

హైదరాబాద్, జులై 30 (ప్రభాత ఉదయం): తెలంగాణ రైతులకు రేవంత్ సర్కార్ తీపి కబురు చెప్పింది. రైతు ప్రయోజనాలే కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమని, అందుకనే రుణమాఫీ చేశామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కార్పొరేట్ సంస్థల అధిపతులు బ్యాంకులను మోసం చేస్తున్నారన్న ఆయన.. గత పదేళ్లలో కార్పొరేట్ కంపెనీలు రూ.14 లక్షల కోట్లు ఎగవేశాయని చెప్పారు. కానీ, సాగుకోసం బ్యాంకుల నుంచి తెచ్చిన అప్పులు తిరిగి కట్టలేక రైతులు నానా అవస్థలు పడుతున్నారని అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం వాళ్ల రుణాలను మాఫీ చేస్తోందని చెప్పారు. రెండో విడత పంట రుణాల మాఫీ నిధుల విడుదల సందర్భంగా శాసనసభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రేవంత్ మాట్లాడారు. అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి రెండో విడత రైతు రుణమాఫీ నిధులు విడుదల చేశారు. ఇప్పటికే రూ.లక్ష ఉన్నవారికి రుణమాఫీ పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 6,40,223 మందికి రూ.6190.01 కోట్లు నిధులు విడుదల చేశారు. మూడో విడత కింద 17, 75, 235 మంది రైతులకు రూ.12,224.98కోట్లు విడుదల చేశారు. రాజకీయ ప్రయోజనం కాదు... రైతు ప్రయోజనం ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రైతు సంతోషంగా ఉండాలని 6మే 2022న వరంగల్ రైతు డిక్లరేషన్ ప్రకటించామని

..మిగతా 2లో

# తిరిగి బీఆర్ఎస్ గూటికి గద్వాల్ ఎమ్మెల్యే

## షాక్‌లో కాంగ్రెస్

గద్వాల, జులై 30 (ప్రభాత ఉదయం): గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కాంగ్రెస్ కు ఊహించని షాక్ ఇచ్చారు ఇవాల బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి పార్టీలో కొనసాగుతానని బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. అనంతరం కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అసెంబ్లీ ఆవరణలో బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి సరదాగా మాట్లాడుకున్నారు. ఒకవైపు అధికార కాంగ్రెస్ 'ఆపరేషన్ ఆకర్ష్'తో ఒక్కొక్కరుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పార్టీలోకి చేరుతున్నారు. ఈ తరుణంలో ఈ అనూహ్య పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఇప్పటివరకు

..మిగతా 2లో






# నోట్లో గుడ్డలు కుక్కి..

## రన్నింగ్ బస్సులో మహిళపై అత్యాచారం

హైదరాబాద్, జులై 30 (ప్రభాత ఉదయం): మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. మహిళలను ఒంటరిగా చూస్తే చాలు.. వారిపై దౌర్జన్యాలకు, అత్యాచారాలకు పాల్పడుతున్నారు. ఈ నేరాలను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా.. నేరాలు మాత్రం ఆగడం లేదు. కదులుతున్న బస్సులో ఓ మహిళపై డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమె నోటికి గుడ్డ పెట్టి ఆమెపై అత్యాచారం చేశాడు. మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెలుగులో వచ్చింది. ఈ సంచలన ఘటన నిర్మల్ లో కలకలం రేపుతుంది. హరికృష్ణ ట్రావెల్ నిర్మల్ నుంచి ప్రకాశం వెళ్తుండగా ఓ మహిళ బస్సులో ఎక్కింది. అయితే అందులో ఇద్దరు డ్రైవర్లు మాత్రమే వున్నారు. ఎవరూ లేకపోవడంతో

..మిగతా 2లో

## వేసవిలో విద్యుత్ డిమాండ్‌కు
# అనుగుణంగా ఏర్పాటు చేశాం

### టీజీఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్



విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవంలో అధికారులతో సీఎండి ముషారఫ్



శంషాబాద్ ధర్మసాయిలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న టీజీ ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్



తన జన్మదినం సందర్భంగా సబ్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న సీఎండి ముషారఫ్

శంషాబాద్, జులై 30 (ప్రభాత ఉదయం): విద్యుత్ వినియోగదారుల అవసరమయ్యే విద్యుత్తును సరఫరా చేయటానికి యాజమాన్యం సిద్ధంగా ఉందని టీజీఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ అన్నారు. రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ పరిధిలోని శంషాబాద్ లో గల ధర్మసాయిలో నూతనంగా నిర్మించిన 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్ సిఎండి ముషారఫ్, సిజిఎం ఆనంద్, ఎస్ ఇ ఎల్ గోపయ్య, సర్కిల్ ఎస్ ఏ ఓ వీరస్వామి,డివిజనల్ ఇంజనీర్లు రాజేంద్రనగర్ డివిజన్ డి ఈ రత్నాకర్ రావు, షాద్ నగర్ డి ఈ యాదయ్య, కందుకూర్ డి ఈ రాజారాంరెడ్డి, రాజేంద్రనగర్ సర్కిల్ డి ఈ (కన్స్ట్రక్షన్)చంద్రశేఖర్ ,అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాసుల తో కలిసి ప్రారంభించారు. అనంతరం సబ్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీఎండీ ముషారఫ్ మాట్లాడుతూ... గత వేసవిలో విద్యుత్ వినియోగదారుల అవసరం మేరకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాను అందించడం జరిగిందన్నారు. రాబోయే వేసవిలో విద్యుత్ వినియోగదారులకు అవసరమయ్యే సామర్థ్యం గల విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేసి నిరంతరం విద్యుత్ సరఫరా అందజేస్తామన్నారు. శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారని ఆయన అభినందించారు. విద్యుత్ వినియోగదారులు తమ ప్రాంతాల్లో ఎలాంటి సమస్య ఉన్న సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ అకౌంట్స్ ఆఫీసర్లు హరీష్ చంద్రశేఖర్, రవీందర్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు ఈశ్వర్ ప్రసాద్, సత్యనారాయణ, అసిస్టెంట్ ఇంజనీర్లు షేక్ బాషా, సురేష్ రెడ్డి, హాథిరాం, ప్రవీణ్, శ్రీనివాస్, జుబేరుద్దీన్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# వయనాడ్ విలయం









మొదటి పేజీ తరువాయి...

నాలుగు వీధుల్లో 65 కుటుంబాలు నివాసం ఉండే ప్రాంతాలపై కొండ చరియలు విరిగిపడ్డాయి. ఆ మొత్తం ఇళ్లు ధ్వంసమైనట్లు చెబుతున్నారు. చాలా మృతదేహాలు మల్లప్పురం చలియార్ నదిలో తేలియాడుతున్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఘటనా స్థలానికి కిలోమీటర్ల దూరంలో దాదాపు 11 మృతదేహాలను స్వాధీనం చేసుకొన్నారు. వీటిల్లో చాలా వాటికి శరీర భాగాలు లేవు. అటవీ ప్రాంతంలోకి అయిదు మృతదేహాలు కొట్టుకు వచ్చినట్లు స్థానిక ఆదివాసీలు తెలిపారు. బాధితులకు సాయం చేయడానికి నౌకాదళానికి చెందిన 30 మంది గజ ఈతగాళ్లను రప్పించారు. రెండు ఎయిర్‌ఫోర్స్ హెలికాప్టర్లను రంగంలోకి దించారు. 200 మంది సైనిక సిబ్బంది కూడా పనిచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 31ని సంతాపదినంగా ప్రకటించింది.

### 600 మంది వలస కార్మికులు ఎక్కడ?

తాజాగా 600 మంది వలస కార్మికుల ఆచూకీ గల్లంతైంది. ముండకై ప్రాంతంలో ఉన్న తేయాకు, కాఫీ, యాలకుల తోటల్లో పనిచేసేందుకు పశ్చిమ బెంగాల్, అస్సాం నుంచి వందల మంది కార్మికులు వస్తుంటారు. ఇక్కడి హారిసన్ మలయాళీ ప్లాంటేషన్ లిమిటెడ్‌లో పనిచేయడానికి దాదాపు 600 మంది వచ్చారు. వీరంతా ముండకైలోనే నివాసం ఉంటున్నారు. తాజాగా కంపెనీ జనరల్ మేనేజర్ బెనిల్ జోన్స్ మాట్లాడుతూ తమ కార్మికులతో ఇప్పటి వరకు సంప్రదించలేకపోయామని, సెల్‌ఫోన్లు కూడా పనిచేయడం లేదని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

### విలయంపై ఎక్స్‌లో స్పందించిన ముర్ము, మోదీ, రాహుల్

కొండచరియలు విరిగిపడి పెను విధ్వంసం జరగడంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. వయనాడ్‌లో ప్రాణనష్టం సమాచారం తీవ్రంగా బాధించింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నా. క్షతగాత్రులు వేగంగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్‌తో మాట్లాడాను. కేంద్రం నుంచి అందించగల అన్నిరకాల సహాయాలు చేస్తాం... అని ప్రధాని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు. కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతుల కుటుంబాలకు ఆయన సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు వేగంగా కోలుకోవాలని ప్రార్థించారు. పీఎం ఎన్ఆర్ఎఫ్ కింద మృతులకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50,000 పరిహారం చెల్లిస్తారని ప్రధాని కార్యాలయం వెల్లడించింది. శిథిలాల కింద చిక్కుకొన్నవారిని త్వరలోనే సురక్షితంగా బయటకు తెస్తారని ఆశిస్తున్నా. కేరళ ముఖ్యమంత్రి, వయనాడ్ కలెక్టర్‌తో మాట్లాడాను. ఏజెన్సీలతో సమన్వయం చేసుకొని కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేయాలని కోరాను. ఏదైనా సాయం అవసరమైతే మాకు తెలియజేయాలని సూచించాను. కేంద్ర మంత్రులతో మాట్లాడి సాయం చేయాలని కోరాను. ఇక యూడీఎఫ్ కూటమి కార్యకర్తలు అధికార యంత్రాంగానికి చేదోడువాదోడుగా ఉండాలని అభ్యర్థిస్తున్నాను... అని వయనాడ్ మాజీ ఎంపీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు ప్రతిఒక్కరూ సురక్షితంగా ఉండాలని ప్రార్థిస్తున్నానని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు యుద్ధ ప్రాతిపదికన గాలింపు, సహాయక చర్యలు చేపట్టాయని హోం శాఖ మంత్రి అమిత్‌షా వెల్లడించారు. అలాగే లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ పశ్చిమ కనుమల్లో గత కొన్నేళ్లుగా చాలా ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడే ముప్పు పొంచి ఉంది. ఇటువంటి ఘటనలు మన దేశంలో పెరిగిపోయాయి. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. పర్యవరణ విపత్తులకు అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో వాటిని ఎదుర్కోవడానికి అవసరమైన యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

### స్టాలిన్ ఆపన్నహస్తం

పొరుగు రాష్ట్రం తమిళనాడు ఆపన్నహస్తం అందించింది. సీఎం నిధుల నుంచి రూ.5 కోట్లు విడుదల చేయాలని సీఎం స్టాలిన్ అధికారులను ఆదేశించారు. 20 మంది అగ్నిమాపక సిబ్బంది, 10 మంది డాక్టర్లతో కూడిన వైద్య బృందాన్ని కేరళకు పంపించనున్నట్లు వెల్లడించారు.



### తిరిగి బీఆర్ఎస్ గూటికి

# గద్వాల్ ఎమ్మెల్యే

మొదటి పేజీ తరువాయి...

పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరగా.. కృష్ణమోహన్‌రెడ్డి బీఆర్ఎస్ లో చేరడంతో ఈ సంఖ్య తొమ్మిదికి చేరింది. అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 75 నుంచి 74కి పడిపోయింది. కాంగ్రెస్‌లో చేరిన వారిలో అరికెపూడి గాంధీ, తెల్లం వెంకటరావు, దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం, డాక్టర్ సంజయ్, కాలేరు యాదయ్య, ప్రకాష్ గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి ఉన్నారు. కాగా.. మరికొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి యూ టర్న్ తీసుకోవడం గమనార్హం. స్థానిక కాంగ్రెస్ నేతలతో కృష్ణమోహన్ రెడ్డికి పొసగకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. అయితే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కేసీఆర్‌ను కాంగ్రెస్‌లోకి పంపారని మరికొందరు వాదిస్తున్నారు. ఇలా చేస్తే కాంగ్రెస్ లోకి వలసలు తగ్గుతాయని అంటున్నారు.

# రైతులకు తీపి కబురు

మొదటి పేజీ తరువాయి...

గత ప్రభుత్వం 60నెలలు నాలుగు విడతల్లో రూ.లక్ష రుణమాఫీ కూడా పూర్తిచేయలేకపోయారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం రూ.25వేల కోట్లు కూడా రుణమాఫీ చేయలేకపోయిందన్నారు. అప్పుల్లో కూరుకుపోయిన తెలంగాణ ప్రభుత్వం ఎలా రుణమాఫీ చేస్తుందని కొందరు మాట్లాడారని.. ఎట్టి పరిస్థితుల్లో రుణమాఫీ చేయాల్సిందేనని ప్రణాళికలు రచించాం.. నిధులు సేకరించామని తెలిపారు నిధుల సవిరీకరణ చేసి ఇవాళ రెండో విడతలో రూ.6,198కోట్లు ఆరున్నర లక్షల మందికి మేలు జరిగేలా చేస్తున్నామని.. ఇది మా చిత్తశుద్ధి, ఇది మా నిబద్ధత అని ప్రకటించారు. నెహ్రూ ఆనాడు హరిత విప్లవం తీసుకు వచ్చారని.. జై జవాన్, జై కిసాన్ నినాదంతో ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్లిందని రేవంత్ తెలిపారు. పేద రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు అందించేందుకు ఇందిరమ్మ బ్యాంకుల జాతీయకరణ చేశారని.. సోనియమ్మ నేతృత్వంలో ఆనాడు ఆహార భద్రత చట్టం తీసుకువచ్చారని తెలిపారు. ఆనాడు రూ.72వేల కోట్లు రుణాలు మాఫీ చేసి దేశంలో రైతులను ఆదుకుంది కాంగ్రెస్ అని గుర్తు చేశారు. అప్పుడు .. ఇప్పుడు ఎప్పుడూ కాంగ్రెస్ రైతు పక్షపాతేనన్నారు. నెల తిరిగేలోగా 1.5లక్షల వరకు రైతు రుణమాఫీ చేసి మా చిత్తశుద్ధి నిరూపించుకున్నామని.. అగస్టులోగా రూ.2లక్షల రుణమాఫీ పూర్తి చేసి రైతులను రుణ విముక్తులను చేస్తామన్నారు. జూలై, ఆగస్టు నెలలు చరిత్రలో లిఖించదగ్గ నెలలు. దేశ చరిత్రలోనే తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ రికార్డు సృష్టించిందన్నారు. స్వతంత్ర భారతంలో ఇప్పటి వరకు ఏ రాష్ట్రం కూడా ఇంత పెద్దమొత్తంలో రైతు రుణమాఫీ చేయలేదని.. గత బీఆరెస్ ప్రభుత్వం




చేసిన అప్పులకు ఈ ఆరునెలల్లో ఆర్థిక మంత్రి రూ.43 వేల కోట్లు వడ్డీ చెల్లించారని ఆరోపించారు. 12 రోజుల్లోనే రుణమాఫీకి 12వేల కోట్లు సేకరించిన ఆర్థిక మంత్రి, వారి సిబ్బందిని అభినందిస్తున్నానన్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున రైతు రుణమాఫీ నిధులు విడుదల చేసేందుకు అసెంబ్లీలోనే ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. రైతులు, పంట పొలాలు, పంటలకు సంబంధించిన అంశాలతో ఆకర్షణీయం గా ఏర్పాటు చేసిన సభా వేదికపై నుంచి కార్యక్రమం పూర్తి చేశారు. గతంలో అనేక మంది రైతులు సొంత పొలంలోనే పురుగుల మందు తాగి ప్రాణాలు కోల్పోయారు. ఏ రైతు కూడా ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోకూడదనేదే మా విధానం. అందుకే ఇవాళ రూ.లక్షన్నర వరకు ఉన్న రైతు రుణాలన్నీ మాఫీ చేశాం. రాష్ట్రంలోని రైతులందరి ఇళ్లల్లో ఇవాళ పండుగ రోజు. సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేశాం. రెండో విడతగా రూ.6,190 కోట్లు మాఫీ చేశాం.' అన్నారు. రుణమాఫీ కింద సుమారు 6.4 లక్షల మంది రైతుల ఖాతాల్లో రెండో విడతగా రూ.6,190 కోట్లు జమ చేసింది. తొలి విడతలో 11.34 లక్షల మంది రైతులకు రూ.6,035 కోట్లు విడుదల చేశారు. ఇప్పటి వరకు 17.75 లక్షల మంది రైతులకు లబ్ది చేకూరింది. రెండు దశల్లో కలిపి రైతుల ఖాతాల్లో రూ.12,225 కోట్లు జమ చేశారు. గత ప్రభుత్వంలో పూర్తిగా మూలనపడ్డ పంటల బీమా పథకాన్ని పునరుద్ధరిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రెండో విడత రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా మాట్లాడిన మంత్రి... ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని నిలబెట్టుకున్నామన్నారు. ఒకే పంటకాలంలో రూ.2 లక్షల మేర రుణమాఫీ చేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అని కొనియాడారు. ఆయిల్‌పామ్ సరఫరాలో రాబోయే ఐదేళ్లలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'రైతులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటున్నాం. ఆగస్టులో రూ.2 లక్షల్లోపు ఉన్న రుణమాఫీని కూడా అమలు చేస్తాం. పంటలబీమా ద్వారా రైతులకు అండగా ఉంటాం. త్వరలోనే గతంలో కంటే భిన్నంగా రైతుభరోసా విధివిధానాలు రూపొందిస్తాం. ఐదేళ్లలో 5 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ వేయాలని కోరుతున్నాం. అనేక రాష్ట్రాలకు పామాయిల్ సరఫరా చేసే స్థాయికి మనం చేరాలి. రైతేరాజు అనే నినాదానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిజమైన అర్థం చెబుతోందని తుమ్మల అన్నారు. రాహుల్ గాంధీ హామీలు ఇచ్చినప్పుడు అందరూ అనుమానాలు వ్యక్తం చేశారని, వారి అనుమానాలను పటాపంచలు చేస్తూ రుణమాఫీ చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రైతుల మేలుకోరే రుణమాఫీపై శరవేగంగా నిర్ణయాలు తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా రెండో విడతగా రుణమాఫీ పొందిన లబ్దిదారులకు ఆయన అభినందనలు తెలిపారు.

# నోట్లో గుడ్డలు కుక్కి..

మొదటి పేజీ తరువాయి...

ఆ మహిళ ఇది ప్రకాశం వెళుతుందా? అని ప్రశ్నించింది. ప్రకాశం వెలుతుందని డ్రైవర్ తెలుపడంతో సీటులో కూర్చింది. అయితే బస్సులో ఎవరూ లేకపోవడం.. ఒంటరి మహిళ కావడంతో ట్రావెల్ డ్రైవర్ బస్సు అద్దాలను అన్నింటి క్లోజ్ చేశాడు. ఇది ఏసీ బస్సు అని ఆమెకు చెప్పాడు. దీంతో ఆమె ఏమీ చెప్పలేకపోయింది. ఇద్దరు డ్రైవర్లు ఒక చోట బస్సును ఆపి ఆమె వద్దకు వచ్చారు. ఆమె పట్టుకుని నోట్లో గుడ్డను కుక్కారు. అయితే ఎవరికి అనుమానం రాకుండా.. ఒకరు బస్సును డ్రైవింగ్ చేస్తుండగా మరొకరు ఆమెపై అత్యాచారం చేశాడు. కదులుతున్న ట్రావెల్స్ బస్సులో ప్రయాణికురాలిపై డ్రైవర్ ఈ దారుణానికి ఒడికడ్డాడు. బస్సు ప్రయాణిస్తుండటంతో ఎవరికి ఏ అనుమానం కలగలేదు. అత్యాచారం అనంతరం బస్సు మధ్యలో ఆపి ఆమెను కిందికి దించి.. ఎవరికి చెప్పకూడదని బెదిరించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. వెంటనే ఆ మహిళ డయల్ 100 కి ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. తనపై డ్రైవర్ అత్యాచారం చేశారని ఫిర్యాదు చేసింది. మేడ్చల్ సమీపంలో బస్ ఉండగా పోలీసులకు ఫిర్యాదు అందడంతో అప్రమత్తమైన సిటీ పోలీసులు బస్ కోసం గాలింపు చేపట్టారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోకి రాగానే బస్సును చేజ్ చేసి పట్టుకున్నారు. హరికృష్ణ ట్రావెల్ సంబంధించిన ఇద్దరు డ్రైవర్లని అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరిక్షలకోసం బాధితురాలిని హస్పటల్ కు తరలించారు. దీనిపై ఇంకా పూర్తి సమాచారం తెలియాల్సి వుంది.

# నేడు గవర్నర్‌గా జిష్ణుదేవ్ శర్మ ప్రమాణం

హైదరాబాద్, జులై 29 (ప్రభాత ఉదయం): తెలంగాణ గవర్నర్‌గా నియామకమైన జిష్ణుదేవ్ వర్మ బుధవారం పదవీ ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాజ్‌భవన్‌లో బుధవారం సాయంత్రం 5.03 గంటలకు ఆయన గవర్నర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టనున్నట్లు రాజ్‌భవన్ పేర్కొంది. రెండురోజుల కిందట కేంద్ర ప్రభుత్వం 9 రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించిన విషయం తెలిసిందే. జిష్ణుదేవ్ వర్మ 2018 నుంచి 2023 వరకూ త్రిపుర రాష్ట్ర డిప్యూటీ సీఎంగా పని చేశారు. 1957 ఆగస్టు 15న స్వాతంత్య దినోత్సవం రోజున జిష్ణుదేవ్ వర్మ జన్మించారు. అంతేకాదు గతంలో బాడ్మింటన్ అసోషియేషన్ ఆఫ్ ఇండియాకు అధ్యక్షుడిగా సేవలందించారు. ఈయన త్రిపుర రాజ కుటుంబానికి చెందిన కాగా.. రామ జన్మభూమి ఉద్యమ సమయంలో పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో పార్టీలో 1990లో చేరారు. ఆయన అప్పటి నుంచి ఆ పార్టీలో కీలకంగా వ్యవహరిస్తూ వచ్చారు. త్రిపుర ప్రభుత్వంలో ఆయన మంత్రిగా విద్యుత్, గ్రావిరీణాభివృద్ధి, పంచాయితీ రాజ్, ఆర్థిక, ప్రణాళిక, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణ శాఖల బాధ్యతలను నిర్వర్తించారు.



# ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత

### విచారణను ఆగస్ట్1కి వాయిదా వేసిన హైకోర్టు

హైదరాబాద్, జులై 29 (ప్రభాత ఉదయం): పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ పై మంగళవారం తెలంగాణ హైకోర్టు విచారణ చేప్టటింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేం దర్, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి , భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావులపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు పిటిషన్ వేశారు.వాదోపవాదాలు విన్న హైకోర్టు .. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసే విధంగా స్పీకర్ కు ఆదేశాలు ఇవ్వాలని కోరారు పిటిషనర్ తరపు న్యాయవాది గండ్ర మోహన్ రావు.స్పీకర్ కు ఫిర్యాదు చేసిన ముగ్గురు ఎమ్మెల్యేలపై ఏలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు గండ్ర. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన పలు తీర్పులను ప్రస్తావించగా.. తదుపరి విచారణ ఆగస్టు 1 కి వాయిదా వేసింది హైకోర్టు.



# సుదీర్ఘ ప్రసంగాలు చేయవద్దు

### సభ్యులకు స్పీకర్ విజ్ఞప్తి

హైదరాబాద్, జులై 29 (ప్రభాత ఉదయం): తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఆరో రోజు ప్రారంభమయ్యాయి. మరో 19 పద్దులపై చర్చ కొనసాగుతుంది. సోమవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమైంది. మంగళవారం తెల్లవారుజామున 3 గంటల వరకు సమావేశం కొనసాగింది. ఈ నేపథ్యంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సభ్యులకు కీలక సందేశం ఇచ్చారు. నిన్నటిలా సుదీర్ఘ ప్రసంగాలు చేయవద్దని స్పీకర్ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ఒక్కో సభ్యునికి 15 నిమిషాల సమయం కేటాయిస్తారు. అనే అంశంపై మాట్లాడాలని సభ్యులందరూ సభ్యులకు సూచించారు. కాగా..ఈరోజు కూడా శాసనసభలో ప్రశ్నోత్తరాల కార్యక్రమం మొదలయ్యాయి. నేడు సభ ముందుకు స్కిల్ యూనివర్సిటీ బిల్లు ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లును మంత్రి శ్రీధర్‌బాబు సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ సమావేశంలో తొమ్మిది శాఖల సమస్యలపై చర్చించనున్నారు. మత్స్యశాఖ, క్రీడలు, యువజన సర్వీసు, సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, మైనార్టీ సంక్షేమంపై నేడు చర్చ జరగనుంది. సాగునీరు, పౌర సరఫరాల సమస్యలపై శాసనసభలో చర్చ జరగనుంది. వ్యవసాయ శాఖ, పర్యాటక శాఖ సమస్యలపై శాసనసభలో చర్చ జరగనుంది. దేవాదాయ, అటవీ శాఖల సమస్యలపై శాసనసభ సభ్యులు చర్చించనున్నారు. రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మాతా శిశు సంక్షేమంపై సభలో చర్చించనున్నారు.



# త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

న్యూఢిల్లీ, జులై 29 (ప్రభాత ఉదయం): 2014కు ముందు యూపీఏ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థ మెరుగ్గా ఉందని చూపేందుకు బడ్జెట్‌లో భారీ ప్రకటనలు గుప్పించేదని, క్షేత్రస్థాయిలో వాటి అమలును పట్టించుకోలేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వికసిత్ భారత్ దిశగా ప్రస్థానం అనే అంశంపై కేంద్ర బడ్జెట్ 2024-25పై సీఐఐ నిర్వహించిన సదస్సులో ప్రధాని ప్రారంభోపన్యాసం చేశారు. పథకాలను పూర్తి చేసేందుకు గత ప్రభుత్వాలు శ్రద్ధ కనబరచలేదని దుయ్యబట్టారు. గత పదేండ్లుగా తాము ఆ పరిస్థితిని మార్చివేశామని ప్రధాని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే తాము రైల్వే బడ్జెట్‌ను 8 రెట్లు పెంచామని, హైవేల బడ్జెట్‌ను 8 రెట్లు, వ్యవసాయ బడ్జెట్‌ను 4 రెట్లు పెంచామని తెలిపారు. రక్షణ బడ్జెట్‌ను రెండింతలు పైగా పెంచామని చెప్పుకొచ్చారు. యూపీఏ హయాంలో లక్షలాది కోట్ల రూపాయల విలువైన అవినీతి కుంభకోణాలు వెలుగుచూసిన విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. తాము శ్వేతపత్రం రూపంలో దేశ ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రాన్ని దేశ ప్రజల ముందుంచామని చెప్పారు. మనం ఎక్కడ ఉన్నామనేదానిపై చర్చ జరగాలని చెప్పారు. భారత పరిశ్రమలను నూతన శిఖరాలకు చేర్చామని తెలిపారు. దేశ అభివృద్ధికి మూలధన వ్యయం కీలకమని 2004లో యూపీఏ తొలి బడ్జెట్‌లో మూలధన వ్యయం కేవలం రూ. 90,000 కోట్లు కాగా, ఇప్పుడు తమ ప్రభుత్వం రూ. 11 లక్షల కోట్లు పైగా మూలధన వ్యయం వెచ్చిస్తోందని ఈ నిధులతో దేశంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇవాళ మనం వికసిత్ భారత్ దిశగా పయనిస్తున్నామని, ఈ మార్పు కేవలం సెంటిమెంట్లతో రాలేదని, ఆత్మవిశ్వాసంతోనే ఇది సాధ్యమైందని అన్నారు. ప్రపంచంలో మనం ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగామని, భారత్ త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



## రాజేంద్రనగర్, మాణిక్యమ్మ కాలనీలో అంగ రంగ వైభవంగా


# ఫలహారపు బండి ఊరేగింపు



ఫలహారపు బండి ని సిద్ధం చేస్తున్న బ్రాహ్మణ పల్లి బాల్ రాజ్



మనుమళ్లతో బ్రహ్మణపల్లి బాల్ రాజ్



అమ్మ వారికి మొక్కుతున్న బి. గౌతమ్ ముదిరాజ్



తమ ఇంట్లో అమ్మ వారికి పూజలు చేస్తున్న బ్రహ్మణపల్లి బాల్ రాజ్ కుటుంబ సభ్యులు





అమ్మ వారు

బుద్వేల్, జూలై30(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ మాణిక్యమ్మ కాలనీలో మంగళవారం బోనాల జాతర అనంతరం నిర్వహించే ఫలహారపు బండి ఊరేగింపు కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. నిర్వాహకులు బ్రాహ్మణపల్లి బాల్ రాజ్ ముదిరాజ్, బి గౌతమ్ కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్ళు, బ్యాండ్ మేళాలతో రాజేంద్రనగర్ పరిసర ప్రాంతాలు మారు మోగాయి. నగరం నలుమూలల నుంచి వచ్చిన పోతరాజులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నల్ల పోచమ్మ , ఈదమ్మ దేవాలయాల వద్ద ఫలహారపు బండి పూజలు నిర్వహించారు.



కొత్తగూడెం మున్సిపాలిటీ కి బదిలీ అయిన రాజేంద్రనగర్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ అబ్దుల్ ఖాదర్ ను సన్మానిస్తున్న డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్, సహచర ఉద్యోగులు

## రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం ఏసీపీ అబ్దుల్ ఖాదర్ కొత్తగూడెం బదిలీ

బుద్వేల్, జూలై30(ప్రభాత ఉదయం):రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం ఏసీపీగా పనిచేస్తున్న అబ్దుల్ ఖాదర్ కొత్తగూడెం మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. సుదీర్ఘ కాలం పాటు నగరంలో పనిచేసిన ఆయనను బదిలీ చేస్తూ జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీకి బదిలీ అయిన అబ్దుల్ ఖాదర్ ను మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

### పలు అక్రమ నిర్మాణాలను ధైర్యంతో నేలమట్టం చేసిన అబ్దుల్ ఖాదర్

రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ పరిధిలో పలు అక్రమ నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ ఏసీపీగా పనిచేసిన అబ్దుల్ ఖాదర్ ధైర్యంతో నేలమట్టం చేశారు. జీహెచ్ఎంసీ కి చెందిన సెప్టిక్ ట్యాంక్ స్థలాలు, పార్కు స్థలాలను ఆక్రమించుకున్న కబ్జాదారుల పాలిట ఆయన సింహ స్వప్నంగా మారి వాటిని స్వాధీనం చేసుకున్నారు. నివాస సముదాయాలలో అనుమతి లేకుండా నిర్మించిన షెడ్లు, మధుబన్ కాలనీ ని అనుకుని ఉన్న ఇందిరా గాంధీ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీలోని పలు షెడ్లను ఆయన ధైర్యంగా నేలమట్టం చేశారు.



నేల ఆరోగ్యంపై జరిగిన సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు

# నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

బుద్వేల్, జూలై30(ప్రభాత ఉదయం) : మానవ మనుగడకి ప్రధాన ఆధారమైన నేల ను రక్షించు కోవలసిన బాధ్యత మన అందరి పైన ఉందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, పరిశోధన సంచాలకులు డాక్టర్ పి. రఘురామి రెడ్డి అభిప్రాయపడ్డారు. సహజ వనరుల విచక్షణారహిత వాడకాన్ని తగ్గిస్తూ, నేలసారం, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి చర్యలు తీసుకోవాలన్నారు. భావితరాలకు కాలుష్య రహిత వనరులను అందిస్తూ, ఆహార ధాన్యాల ఉత్పత్తిలో నెలకొన్న స్తబ్దతని అధిగమించాలని రఘురామిరెడ్డి సూచించారు. దీర్ఘకాలిక ఎరువుల విధానం, జీవన ఎరువులు, దీర్ఘకాలిక ఎరువుల యాజమాన్యం, సూక్ష్మ పోషకాలు, భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల సిఫార్సు విధానం అంశాలపై పరిశోధనలు సాగిస్తున్న దక్షిణాది రాష్ట్రాలు, చత్తీస్ ఘడ్ రాష్ట్ర అఖిల భారత సమన్వయ పరిశోధన ప్రాజెక్టుల పరిశోధన ప్రగతిని సమీక్షించడానికి ఉద్దేశించిన సదస్సు మంగళవారం రాజేంద్రనగర్ లోని విస్తరణ విద్యాసంస్థలో ప్రారంభమైంది. ఈ సదస్సు మూడు రోజులపాటు జరగనుంది. రిజిస్ట్రార్ , పరిశోధన సంచాలకులు పి. రఘురామి రెడ్డి ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జమ్ములోని షేర్ - ఇ - కాశ్మీర్ (యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ టెక్నాలజీ) వ్యవసాయ విశ్వవిద్యాలయం, మాజీ ఉపకులపతి డాక్టర్ పి కె శర్మ చైర్మన్ గా ఏర్పాటైన ఎనిమిది మంది సభ్యుల బృందం భోపాల్ లోని భారత మృత్తికా శాస్త్ర సంస్థ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సులో ఐదు అఖిల భారత సమన్వయ పరిశోధన ప్రాజెక్టుల సమన్వయకర్తలు డాక్టర్ ఎస్. శ్రీవాత్సవ, డాక్టర్ ఎస్ కె బెహరా, డాక్టర్ ఆర్ హెచ్ వంజరి, డాక్టర్ ఎస్ మహంతి, డాక్టర్ ఎ కె బిశ్వాస్ లతోపాటు దక్షిణ తెలంగాణ మండల సహా పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎం. మల్లా రెడ్డి, మృత్తికా ఆరోగ్య యాజమాన్య సంస్థ, రాజేంద్రనగర్ బాధ్యులు డాక్టర్ ఎ. మాధవి, పరిశోధన శాస్త్రవేత్తలు డాక్టర్ కె. పవన్ చంద్రా రెడ్డి, డాక్టర్ ఎం. శంకరయ్య, డాక్టర్ టి.సుకృత్ కుమార్ లు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ లోని మృత్తికా యాజమాన్య సంస్థ దీర్ఘకాలిక ఎరువుల యాజమాన్య విభాగం, జగిత్యాల వ్యవసాయ పరిశోధన స్థానం రూపొందించిన ప్రచురణల్ని విడుదల చేశారు.



ప్రమాద రహిత వారోత్సవాల ముగింపు లో పాల్గొని మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ నర్సింహులు

# ఆర్టీసీలో ముగిసిన ప్రమాద రహిత వారోత్సవాలు

బుద్వేల్, జూలై30(ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లో ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన ప్రమాద రహిత వారోత్సవాలు మంగళవారం ముగిసాయి. ఇందులో భాగంగా మంగళవారం రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపోలో ప్రమాద రహిత వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ నర్సింహులు, ఎస్ ఐ రవీందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు నర్సింహులు మాట్లాడుతూ, ప్రమాదాల నివారణ కు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డ్రైవర్లకు వివరించారు. అదేవిధంగా రాజేంద్ర నగర్ డిపో లో గత 29 సంవత్సరాల నుంచి ఒక్క యాక్సిడెంట్ కూడా చేయకుండా యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్ గా మొదటి స్థానంలో నిలిచిన మహమ్మద్ హమీద్, 28 సంవత్సరాల నుంచి ఒక్క యాక్సిడెంట్ కూడా చేయకుండా యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్ గా రెండవ స్థానంలో నిలిచిన జి.సురేందర్ , 27 సంవత్సరాల నుంచి ఒక్క యాక్సిడెంట్ కూడా చేయకుండా యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్ గా మూడవ స్థానంలో నిలిచిన బి ఎస్ రెడ్డి లను సన్మానించడం జరిగింది . ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ బద్రీ నారాయణ, అసిస్టెంట్ మేనేజర్ రవికుమార్, మెకానికల్ ఇంజనీర్ నిలీమ , ఎస్ టి ఐ సుశీల తో పాటు డిపో సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్తమ డ్రైవర్ లను సన్మానిస్తున్న అధికారులు




శివరాం పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన శిక్ష సప్తహ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

# శివరాంపల్లి ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ వేడుకలు

బుద్వేల్, జూలై30(ప్రభాత ఉదయం) : కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానం నాలుగో వార్షికోత్సవం పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 22 నుంచి 28 వ తేదీ వరకూ వారం రోజుల పాటు రంగారెడ్డి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో శిక్షా సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మంగళవారం తో ముగిసింది. శివారాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ముగింపు కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాద్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పడమటి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సభా అధ్యక్షులు , పాఠశాల ప్రదానోపాధ్యాయులు కిషన్ మాట్లాడుతూ వారం రోజులుగా కార్యక్రమం విజయవంతంగా జరగడానికి సహకరించినందుకు గానూ ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. ఉపాద్యాయుల నరసింహ చారి మాట్లాడుతూ 'పాఠశాలకు ట్రాన్స్ఫర్ మీద వచ్చిన ఉపాద్యాయుల కొత్త పాత అనే భేదం లేకుండ సహకరించడం అభినందనీయం' అన్నారు. శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులలో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయుట లో ఉపాద్యాయుల కృషి అభినందనీయం అన్నారు. విద్యార్థులు తమలో ఉన్న నైపుణ్యాలకు సాన పెట్టుకొని క్రమశిక్షణ గల పౌరులుగా ఎదగాలని అన్నారు.

# బండ్లగూడలో క్రేన్ ప్రమాదం



బండ్లగూడ ఓం నగర్ లో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తు భవనం

రాజేంద్రనగర్, జూలై30(ప్రభాత ఉదయం): బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధి లోని ఓం నగర్ కాలనీ లో నిర్మాణం లో ఉన్న బహుళ అంతస్తు భవనానికి నిర్మాణ సామాగ్రి ని పైకి తీసుకు వెళ్తున్న క్రేన్ పక్కనే ఉన్న ఇంటి పైకి ఒరిగి పోయింది. ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. తన ఇంటి మిద్దె పై చంటి బిడ్డ తో వాకింగ్ చేస్తున్న నిలోఫర్ అనే వివాహితకు ప్రమాదం తప్పింది. క్రేన్ తమ ఇంటి మెట్ల వైపు పడటం తో ఒక్కసారిగా భయభ్రాంతులకు గురై కిందకు పరుగులు తీసిన నిలోఫర్. భారీ శబ్దానికి ఇళ్ల నుండి బయటకు పరుగులు తీసిన కాలనీ వాసులు. బండ్లగూడ జాగీర్ మునిసిపల్ కార్పోరేషన్ ఓం నగర్ కాలనీ లో కొనసాగుతున్న బహుళ అంతస్తుల భవనం. 24 గంటలు నిర్విరామంగా కొనసాగుతున్న బహుళ అంతస్తుల భవన నిర్మాణ పనులు. కంస్ట్రష్కన్ ఇంచార్జ్ పై దాడికి యత్నించిన కాలనీ వాసులు. విషయాన్ని తెలుసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నిర్మాణ సంస్థ సూపర్ వైసర్ వెంకటేశ్వర్లు ను ప్రశ్నిస్తున్నట్లు సమాచారం.

# ఆసియా ఖండంలో విస్తీర్ణంలో పెద్దదైన మెదక్ చర్చ్



మెదక్ చర్చ్



మెదక్ చర్చ్ ముఖ ద్వారం

మెదక్ ప్రతినిధి, జూలై30(ప్రభాత ఉదయం): చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా గా, మెదక్ డయాసిస్ గా, మెదక్ క్యాథెడ్రల్ గా పిలువబడుతున్న మెదక్ చర్చ్ విస్తీర్ణంలో ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన చర్చ్ గా ప్రసిద్ధి చెందింది. ఈ చర్చి ను ఇంగ్లాండ్ కు చెందిన రెవరెండ్ చార్లెస్ వాకర్ పాస్నెట్ నిర్మించారు. 1914 లో ప్రారంభమైన చర్చ్ నిర్మాణం 1924 లో పూర్తయింది. పది సంవత్సరాల పాటు ఇంగ్లాండ్ ఇంజనీర్ లు, ఇటాలియన్ పని వారితో ఈ చర్చ్ ని నిర్మించడం జరిగింది. గోథిక్ స్టయిల్ లో ఈ చర్చిని నిర్మించారు. 175 ఫీట్ల ఎత్తు, 200ఫీట్ల పొడవు, 100 ఫీట్ల వెడల్పు తో నిర్మించిన మెదక్ చర్చ్ లో ఒకే సారి ఐదు వేల మంది కూర్చుని ప్రార్థన లు చేసుకునే అవకాశం ఉంది. ఇంగ్లాండ్ నుంచి తెప్పించిన ఆరు రంగుల టైల్స్ తో చర్చ్ నిర్మాణం జరిగింది. చర్చ్ లోపలి భాగంలో మూడు పక్కల గ్లాస్ విండోస్ ఉన్నాయి. ఆ గ్లాస్ విండోస్ లలో యేసు క్రీస్తు పుట్టుక, యేసు క్రీస్తు ను సిలువ వేయడం, యేసు క్రీస్తు మూడవ దినమున లేచి అవరోహణం అయ్యే చిత్రాలు ఉంటాయి. వెలుతురు కు అవి ప్రకాశిస్తుంటాయి. యేసు ప్రభువు జీవిత సన్నివేశాలను గ్లాస్ అద్దాలు ప్రతిబింబిస్తాయి అని చెప్పవచ్చు. ప్రతి రోజు ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు చర్చ్ తెరచి ఉంటుంది.

### రోజు వందల సంఖ్యలో భక్తుల సందర్శన :

మెదక్ చర్చ్ ను ప్రతి రోజు వందల సంఖ్యలో భక్తులు సందర్శిస్తుంటారు. కుల, మతాల కతీతంగా అన్ని వర్గాల ప్రజలు చర్చ్ ను సందర్శించడం గమనార్హం. ఆదివారం వేలాది మంది మెదక్ చర్చ్ లో ప్రార్థన లలో పాల్గొంటారు.. దేశ విదేశాలకు చెందిన క్రైస్తవులు మెదక్ చర్చ్ ను సందర్శించి ప్రార్థనలు చేస్తుంటారు.



చర్చ్ ప్రాంగణం

### మెదక్ చర్చ్ ఆధ్వర్యంలో పలు చర్చిలు, విద్యా, ఆధ్యాత్మిక, సేవా సంస్థలు :

మెదక్ చర్చ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అనేక చర్చిలు, విద్యాసంస్థలు ఉన్నాయి. మెదక్ చర్చ్ కెథడ్రల్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక శిక్షణా కార్యక్రమాలతో పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు.

# మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేసేంతవరకు పోరాటాలు చేస్తాం

## మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్



ధర్నాలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు




కార్మికులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఏఐటీయూసీ నాయకులు వనంపల్లి జైపాల్ రెడ్డి

హైదరాబాద్, జూలై 30(ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ఇంద్ర పార్క్ దగ్గర తమ సమస్యలపై ధర్నా చేశారు .ఈ సందర్భంగా మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో అన్ని రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు పర్మినెంట్ చేసేంతవరకు కార్మికులందరికీ కనీస వేతనాలు 26 వేల రూపాయలు అమలు చేయాలన్నారు. రాష్ట్రంలోని మున్సిపల్ శాఖ సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి చూస్తున్నారు ముఖ్యమంత్రి పారిశుద్ధ్య కార్మికుల సమస్యల మీద అసెంబ్లీలో మాట్లాడి కనీస వేతనాలు అమలు చేస్తానని నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రజల ఆరోగ్యాల పట్ల నిరంతరం శ్రమిస్తున్న మున్సిపల్ సిబ్బందిని అడుగడుగున వివక్షతకు గురవుతున్నారని అన్నారు. పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికుల ఫేస్ స్కానర్ హాజరు పేరుతో కార్మికుల జీతాలకు కోతలు విధిస్తున్నారనీ విధులు నిర్వహించిన కూడా టెక్నికల్ సమస్యలతో కార్మికుల జీతాలు కట్ అవుతున్నాయని తీవ్రంగా మండిపడ్డారు. శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్లకు అందరికీ జిహెచ్ఎంసి సంస్థ నుండి హాజరు తీసుకోవడానికి సెల్ ఫోన్లో ఇవ్వాలి నెట్ సౌకర్యం కల్పించాలి ఉన్నారు కార్మికుల విధి నిర్వహణలు మరణిస్తే 25 లక్షల రూపాయలు ఇవ్వాలన్నారు అనేకమైనటువంటి సమస్యలను పరిష్కరించాలన్నారు ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్లు మలేరియ డిపార్ట్మెంట్ కార్మికులు మున్సిపల్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఏబీవీ పురంలో ఘనంగా అమ్మవారి బోనాల ఉత్సవాలు

## పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ముమ్మారెడ్డి ప్రేమ కుమార్

కూకట్‌పల్లి, జూలై 30 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం లోని ఎవిబిపురంలో అమ్మవారి బోనాల జాతర అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ తలుపులమ్మ తల్లి నీలమణి దుర్గమ్మ తల్లి దేవాలయ కమిటీ సభ్యులు మరియు జనసేన నాయకుల ఆహ్వానం మేరకు కూకట్ పల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్, పులగం సుబ్బు, శివశంకర్ , యోగేశ్వరరావు, శ్రీకాంత్, దుర్గారావు, హర్షిత్, అర్జున్, ఈశ్వర్ ,సాయికుమార్, గోవింద, హిమగిరి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రంలో బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి: బీజేపీ డిమాండ్



రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు, పార్టీ నాయకులు

బుద్వేల్, జూలై30 (ప్రభాత ఉదయం) : తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం ఆ పార్టీ నాయకులు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ను ముట్టడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరున ఓబీసీలకు ఇచ్చిన మాట మర్చిపోయి, ఓబీసీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు పరచడం లేదని వాపోయారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీజేపీ నాయకులు ఆచారి, జిల్లా అధ్యక్షులు బొక్క నరసింహ రెడ్డి , టి.అంజన్ కుమార్ గౌడ్ , వై. శ్రీధర్, ఎన్. మల్లారెడ్డి, పి మల్లేష్ యాదవ్, ఎం. కొమురయ్య , కాడెం సుధాకర్, ఓబీసీ మోర్చా రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సులిగె వెంకటేష్ , రాచూరి రాజశేఖర్, జగన్, విజయకుమార్ , విశాల్, ఠాగూర్ , కిట్టు , రాము, మూల శ్రీనివాస్ గౌడ్ తో కలిసి ఆందోళన నిర్వహించి కలెక్టర్లకు మెమోరండం ఇవ్వడం జరిగినది




# మానవ అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 30(ప్రభాత ఉదయం)మనుషులను అపహరించి, వేర్వేరు ప్రాంతాల్లో విక్రయించడం చట్టరీత్యానేరం. మానవ అక్రమ రవాణాను అరికట్టాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి స్పష్టం చేశారు. మంగళవారం గద్వాల్ రైల్వే స్టేషన్ లో రూరల్ డెవలప్మెంట్ సొసైటీ మరియు కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ వారు సంయుక్తంగా అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాని నిర్వహించారు. ఈ సందర్భంగా మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నిషేధ చట్టం 1956 ప్రకారం మానవ అక్రమ రవాణాకు పాల్పడిన వ్యక్తులకు కనీసం ఏడు సంవత్సరాల నుంచి జీవితకాలం జైలు శిక్ష విధించబడుతుంది అని తెలిపారు. పిల్లలను అక్రమ రవాణా నుంచి మరియు బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహం, లైంగిక వేధింపులు ఎదురైతే 1098 మరియు100, నెంబర్లకు ఫోన్ ద్వారా సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపిఓ నరసింహ, బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ సహదేవుడు, సభ్యులు శైలజ, జయభారతి,ఆర్ పి ఎఫ్ ఎస్సై అసదుల్లా మరియు ఆంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ శ్రీనివాసులు, వెంకటయ్య, కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, రైల్వే సిబ్బంది,కైలాష్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ సిబ్బంది మద్దిలేటి, వడ్డే లత, విజ్జు లతా, ధనలక్ష్మి, సఖి కేంద్రం సిఏ కవిత, కేస్ వర్కర్ స్వాతి, రైల్వే ప్రయాణికులు పాల్గొన్నారు.



టి జి ఎస్ పి సి డి సి ఎల్ సి ఎండి ముషారఫ్ జన్మదిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యుత్ ఉద్యోగుల సంఘం నేత భాస్కర్ రెడ్డి

# ఉద్యోగుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ చేపడుతాం: సీఎం డి ముషారఫ్

## సిఎండి ముషారఫ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అధికారులు, సిబ్బంది

మెహదీపట్నం, జూలై 30() విద్యుత్ శాఖలో త్వరలో అధికారులు, ఉద్యోగు పదోన్నతులు, బదిలీల ప్రక్రియ జరుగుతుందని టిజి ఎస్ పి డి సి ఎల్. సిఎండి ముషారఫ్ తెలిపారు. మంగళవారం సీఎం డి ముషారఫ్ విద్యుత్ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి అధికారులతో సమావేశమై విద్యుత్ సరఫరా, విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా రెవెన్యూ వసూలు పై సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎండి ముషారఫ్ జన్మదినం పురస్కరించుకొని డిస్కం 1104 ఉద్యోగ సంఘం అదనపు కార్యదర్శి ఎం భాస్కర్ రెడ్డి, సంఘం ప్రతినిధులు గౌస్, రాజేంద్రనగర్ సర్కిల్ సెక్రెటరీ లక్ష్మీనారాయణ గౌడ్, యూసఫ్, రాజేష్ గౌడ్, రఘువర్ధన్ రెడ్డి, లతో కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఉద్యోగ సంఘం నాయకుడు భాస్కర్ రెడ్డి సంస్థలో అధికారుల, ఉద్యోగల పదోన్నతులు, బదిలీలు అపరిష్కృతంగా ఉన్నాయని సీఎం దృష్టికి ఎందుకు సిఎండి ముషారఫ్ పదోన్నతులు, బదిలీలు త్వరలో జరుగుతాయ ని ఈ కార్యక్రమంలో మహిళ ఉద్యోగులు బిందు, అనిత , తదితరులు పాల్గొన్నారు.



# కూకట్ పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉదయరావు నియామకం

కూకట్‌పల్లి, జూలై 30 (ప్రభాత ఉదయం) శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ మరియు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు కూకట్ పల్లి డివిజన్ జనరల్ సెక్రెటరీ గా మంగళవారం ఉదయ్ రావు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉదయరావు మాట్లాడుతూ నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని, దీనికి సహకరించిన 121 డివిజన్ సీనియర్ నాయకులకు మరియు డివిజన్ కార్యవర్గ సభ్యులకు పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ఉదయ్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నూతన బాధ్యతలు చేపట్టిన జలమండలి అధికారిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన పాపిరెడ్డి నగర్ బస్తి అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి

కూకట్‌పల్లి, జూలై 30 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి జలమండలి అధికారిని గా నూతన బాధ్యతలు చేపట్టిన నాగ ప్రియను మంగళవారం వారి కార్యాలయంలో పాపి రెడ్డి నగర్ బస్తి అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చర్ల రామకృష్ణారెడ్డి, మొగుళ్ల కనకా రెడ్డి, పి శంకర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానం మెరుగుపరచుకోవడం అవసరం

## నూతన పరిజ్ఞానంతో నేరస్తులను త్వరగా పట్టుకోవచ్చు...

## ఐటీ నిపుణుల ద్వారా అధికారులకు శిక్షణ ఇప్పించిన బాలానగర్ డిసిపి సురేష్ కుమార్



కూకట్‌పల్లి, జూలై 30 (ప్రభాత ఉదయం) ప్రతి ఒక్కరూ మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన సాంకేతిక పరిజ్ఞానం మెరుగుపరచుకోవడం ఎంతో అవసరమని బాలానగర్ డిసిపి సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం బాలానగర్ పోలీస్ స్టేషన్ లో బాలానగర్ జోన్ లోని అన్ని పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్, ఇన్స్పెక్టర్స్, ఎస్సైలకు, టెక్నికల్ సిబ్బంది, స్టేషన్ రైటర్లకు ఐటి నిపుణుల ద్వారా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరచుకోవడానికి కావలసిన ప్రత్యేక ట్రైనింగును నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ సురేష్ కుమార్ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది అందరికి మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరికి నూతన సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని, దానిని దృష్టిలో పెట్టుకొని జోన్ లో గల అధికారులకు లేటెస్ట్ టెక్నాలజీ లపై ట్రైనింగ్ ను ఏర్పాటు చేసి అందరికి శిక్షణ ను ఇవ్వడం జరిగిందని అన్నారు. కేసు దర్యాప్తుని వేగవంతం చేసి నేరస్తులను త్వరగా పట్టుకోవడానికి, నేరస్తులకు శిక్ష పడడానికి కలెక్ట్ చేయవలసిన ఎవిడెన్స్ పై ఈ శిక్షణ ద్వారా నేర్పించామని అన్నారు. ప్రత్యేక చొరవ తీసుకొని ట్రైనింగ్ ను ఏర్పాటు చేసినందుకు ట్రైనింగ్ లో పాల్గొన్న సిబ్బంది డీసీపీ కి, సీపీ కి కృతజ్ఞతలు తెలియజేసారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.